### వహీ అవతరించునప్పుడు ప్రవక్త పరిస్థితి?

**عَنْ عُبَادَةَ بْنِ الصَّامِتِ ﷺ قَالَ كَانَ نَبِيُّ اللهِ ﷺ إِذَا أُنْزِلَ عَلَيْهِ كُرِبَ لِذَلِكَ وَتَرَبَّدَ لَهُ وَجْهُهُ.**

**80–** ఉబాద బిన్ సామిత్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై వహీ అవతరించే సందర్భంలో ఆయనకు చాలా కష్టం ఏర్పడేది. ముఖ కవళికలు పూర్తిగా మారిపోయేవి. (ముస్లిం 1630, 2334).

### ఈ హదీసులో:

ఇందులో "కరబ" అన్న పదం వచ్చింది. అంటే వహీ పట్ల పూర్తి శ్రద్ధ వల్ల ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంకు చాలా కష్టం, బాధ కలిగేది. మరియు "తరబ్బద వజ్ హుహు" అంటే ముఖం ఎరుపుగా మారిపోయేది. అవతరించే విషయం మహా గొప్పది గనుక. ఎలా అనగా వహీ అల్లాహ్ వాక్యం. అందులో ఆదేశాలు, వారింపులు, గద్దింపులు, సమాచారాలు ఉంటాయి. అవి విన్నారంటే బాలల తలల్లో కూడా ముసలితనం వచ్చేస్తుంది. శరీరం కంపిస్తుంది. స్పృహ గలవారు స్పృహ తప్పిపోయేటంత పనవుతుంది. అల్లాహ్ సహాయమే శరణం.

عَنْ ابْنِ عَبَّاسٍ فِي قَوْلِهِ تَعَالَى ﴿لَا تُحَرِّكْ بِهِ لِسَانَكَ لِتَعْجَلَ بِهِ﴾ قَالَ كَانَ رَسُولُ اللهِ ﷺ يُعَالِجُ مِنْ التَّنْزِيلِ شِدَّةً وَكَانَ مِمَّا يُحَرِّكُ شَفَتَيْهِ فَقَالَ ابْنُ عَبَّاسٍ فَأَنَا أُحَرِّكُهُمَا لَكُمْ كَمَا كَانَ رَسُولُ اللهِ ﷺ يُحَرِّكُهُمَا فَحَرَّكَ شَفَتَيْهِ فَأَنْزَلَ اللهُ تَعَالَى ﴿لَا تُحَرِّكْ بِهِ لِسَانَكَ لِتَعْجَلَ بِهِ ، إِنَّ عَلَيْنَا جَمْعَهُ وَقُرْآنَهُ﴾ قَالَ جَمْعُهُ لَكَ فِي صَدْرِكَ وَتَقْرَأَهُ ﴿فَإِذَا قَرَأْنَاهُ فَاتَّبِعْ قُرْآنَهُ﴾ قَالَ فَاسْتَمِعْ لَهُ وَأَنْصِتْ ﴿ثُمَّ إِنَّ عَلَيْنَا بَيَانَهُ﴾ ثُمَّ إِنَّ عَلَيْنَا أَنْ تَقْرَأَهُ فَكَانَ رَسُولُ اللهِ ﷺ بَعْدَ ذَلِكَ إِذَا أَتَاهُ جِبْرِيلُ اسْتَمَعَ فَإِذَا انْطَلَقَ جِبْرِيلُ قَرَأَهُ النَّبِيُّ ﷺ كَمَا قَرَأَهُ).

81- హజ్రత్ ఇబ్ను అబ్బాస్ రజియల్లాహు అన్హు సూర ఖియామలోని ఆయతు ﴿لَا تُحَرِّكْ بِهِ لِسَانَكَ لِتَعْجَلَ بِهِ﴾ **"ప్రవక్తా! ఈ వహీని జ్ఞాపకముంచుకోవడానికి తొందరతొందరగా నాలుక తిప్పకు"** యొక్క వ్యాఖ్యానం చేస్తు ఇలా చెప్పారుః ఖుర్ఆన్ అవతరణ సందర్భంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ పెదవులను కదిలించేవారు. దానివల్ల ఆయనకు చాలా బాధ కలిగేది. ప్రవక్త కదిలించే విధంగా నేను కదిలిస్తాను చూడండని ఇబ్ను అబ్బాస్ రజియల్లాహు అన్హు తమ పెదవులను కదిలించారు. అప్పుడు అల్లాహ్ ﴿لَا تُحَرِّكْ بِهِ لِسَانَكَ لِتَعْجَلَ بِهِ ، إِنَّ عَلَيْنَا جَمْعَهُ وَقُرْآنَهُ﴾ **"ప్రవక్తా! ఈ వహీని జ్ఞాపకముంచుకోవడానికి తొందరతొందరగా నాలుక తిప్పకు. దాన్ని నీకు గుర్తు చేయించడం, నీ చేత చదివించడం మా పని"** అనే ఆయతులను అవతరింపజేశాడు. అంటే మీ హృదయంలో సమకూర్చడం మా పని, ఆ తర్వాత మీరు అట్లే చదవగలరు. ﴿فَإِذَا قَرَأْنَاهُ فَاتَّبِعْ قُرْآنَهُ﴾ **"అంచేత మేము పఠిస్తున్నప్పుడు నీవు దాన్ని శ్రద్ధగా ఆలకిస్తూ ఉండు చాలు"**. అంటే మీరు నిశ్శబ్దంగా

ఉండి, శ్రద్ధగా వినండి. ﴿ثُمَّ إِنَّ عَلَيْنَا بَيَانَهُ﴾ **"ఆ తరువాత మీకు దాని భావం తెలియజేయడం కూడా మా బాధ్యతే"**. అంటే మీరు చదివే విధంగా మీకు సులభం చేయడం మా బాధ్యత. అప్పటి నుంచి జిబ్రీల్ అలైహిస్సలాం వహీ తీసుకొని వచ్చినప్పుడల్లా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శ్రద్ధగా ఆలకించేవారు. జిబ్రీల్ వెళ్ళి పోయాక ఆయన చదివినట్లే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చదివేవారు. (అంటే జిబ్రీల్ నోట ఒక్కసారి వినగానే ప్రవక్తకు గుర్తుండిపోయేది).

### *ఈ హదీసులో:*

ఖుర్ఆన్ పారాయణం నెమ్మదిగా ఆగిఆగి చేయాలి. వహీ అవతరణ సందర్భంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అధిక శ్రద్ధ వల్ల చాలా బాధ, భారం కలిగేది. హేళన, పరిహాసం లాంటి ఉద్దేశం లేనప్పుడు ప్రవక్త ఇలా చేసేవారని ఏదైనా చలనం చేసి చూపించడం తప్పు కాదు.

తన పవిత్ర గ్రంథం వృధా కాకుండా కాపాడే పూచి అల్లాహ్ తీసుకున్నాడు. ప్రవక్త తమ హృదయంలో అల్లాహ్ గ్రంథాన్ని భద్రపరుచుకొనుట కూడా ఒక మహత్యం. ఎందుకనగా ఆయన "ఉమ్మీ".

సంభాషణ సమయంలో వివరణ ఇవ్వకుండా ఆలస్యం చేయవచ్చునని తెలిసింది. ఖుర్ఆన్ అవగాహన, అందులో యోచించటానికి దాని పారాయణ సందర్భంలో మౌనం వహించి, శ్రద్ధగా వినడం ధర్మం.

శిష్యుడు పండితుని ముందున్నప్పుడు శ్రద్ధగా వింటూ, నిశ్శబ్దంగా ఉండాలని, ఆయన మాట మధ్యలో ఆపకూడదని తెలిసింది.

విద్య మరచిపోకుండా మరియు వృధా కాకుండా ఉండడానికి దాన్ని కంఠస్తం చేసుకొనుట, లిఖితపూర్వకంగా భద్రపరచుట, దాని పట్ల ఎల్లప్పుడూ శ్రద్ధ వహించుటలో మనస్సు లగ్నం చేసి ఉండాలి.

పండితుడు చదివినట్లు అతని వెంట వెంటనే చదువుతూ పారాయణంలో ఆయన్ను అనుసరిస్తూ ఉండాలి.

పండితుల ద్వారా విద్యనభ్యసించే పద్ధతి ఏమిటంటే, వారు చెబుతున్న విషయాన్ని తొందరగా గుర్తుంచుకోవాలి. వ్రాసుకోవాలి.

క్రమంగా, కొంచెం కొంచెం విద్య నేర్చుకోవాలి. ఒకేసారి అధిక భాగంలో తీసుకున్న వ్యక్తి, అంతే భాగంలో పోగుట్టుకుంటాడు.

విద్య స్థిరంగా ఉండడానికి అడపాదడపా దాన్ని నెమరవేస్తూ (review చేస్తూ) ఉండాలి. ఈ విషయానికి ఆధారం " జిబ్రీల్ వెళ్ళి పోయాక ఆయన చదివినట్లే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చదివేవారు", అన్న హదీసు భాగం.

విద్యాభ్యాసంలో కష్టపడుట, అందులో కలిగే ఆపదల పై ఓపిక వహించుట చాలా అవసరం. ధర్మ విద్య అంతటి గొప్పది గనుక.